

మూడు నెలలుగా..
గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు.దీంతో కుటుంబ పోషణభారంగా మారింది.
- 8లో ▸



బాల్యంపై 'బ్యాగు' భారం
ప్రయివేటు పాఠశాలలో చదివే చిన్నారులు లేత భుజాలపై బండెడు పుస్తకాలు మోస్తూ ఇబ్బందులుపడుతున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.8 /23.8
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

13న ఊర పండుగ



నిజామాబాద్‌రూరల్: నగరంలో ఈ నెల 13న ఆదివారం ఊర పండుగ నిర్వహించనున్నట్లు సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సిర్నాపల్లిగడిలో పండుగ సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరంలోని ఖిల్లా చౌరస్తా నుంచి పెద్దబజార్, ఆర్య సమాజ్, గోల్ హనుమాన్ ఆలయం మీదుగా వినాయక్‌నగర్ వరకు గ్రామదేవతల ఊరేగింపు ఉంటుందన్నారు. మరో గ్రామ దేవత దుబ్బ వైపు వెళ్తుందని పేర్కొన్నారు. గురువారం బండారు వేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సర్వ సమాజ్ కమిటీ ప్రతినిధులు బంటు రాము, ఆదె ప్రవీణ్, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాలల సంక్షేమానికి కృషి చేయాలి



నిజామాబాద్ నాగారం : జిల్లాలోని మాలల సంక్షేమానికి కృషి చేయాలని, ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులకు మాజీ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఉన్న సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన జిల్లా కమిటీతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు అలుక కిషన్, జిల్లా అధ్యక్షుడు స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి చొక్కం దేవదాస్, తదితరులు పాల్గొన్నారు

పేలుడు పదార్థాల కేసులో కాంగ్రెస్ నేత అరెస్ట్

కామారెడ్డి క్రైం: అక్రమంగా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచిన కేసులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కేపీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణం కోసం బండరాళ్లు పగుల గొట్టడానికి యజమాని శ్రీధర్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో ఒప్పందం చేసుకున్నాడు. వారంతా కలిసి ఈనెల 4న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఇతర సామగ్రితో బండరాళ్లు పేల్చడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. చుట్టుపక్కల వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. లింగాపూర్ వద్దనున్న శ్రీవారి వెంచర్‌లో నిల్వ చేసిన 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటోనేటర్లు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసిన గది మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అతడి సోదరుడు గడ్డం సురేందర్‌రెడ్డిలది. శనివారం అర్ధరాత్రి చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి నిజామాబాద్ జైలుకు తరలించారు. సురేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారు.

అడ్డేముంది.. ఆక్రమించేద్దాం!

- పులాంగ్ వాగు, నిజాంసాగర్ కాలువల కబ్జా
- రామర్తి, బ్రహ్మ చెరువుల ఆనవాళ్లు మాయం
- భారీ వర్షం కురిస్తే నగరంలో అంతా ఆగమాగం
- వరద నీరు ప్రవహించే అవకాశం లేకుండా అక్రమ నిర్మాణాలు
- నాలాలనూ వదలని వైనం
- మున్సిపల్ అధికారుల అనుమతులపై అనుమానాలు



పులాంగ్ చౌరస్తాలో ఇరువైపులా అక్రమణకు గురైన పులాంగ్ వాగు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరం మధ్యలో నుంచి ప్రవహించే పులాంగ్‌వాగు కబ్జా అవుతుండడంతో వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రెండు గంటలపాటు భారీ వర్షం కురిస్తే ఇందూరు నగరంలోని ప్రధాన రోడ్లన్నీ నీటితో నిండుతున్నాయి. నగరం నుంచి మురుగునీటితోపాటు వర్షపు నీరు వెళ్లిపోవడంలో పులాంగ్ వాగుది ప్రధాన పాత్ర. అయితే వాగును కొందరు అక్రమార్కులు అడుగడుగునా కబ్జా చేయడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో పిల్లకాలువలా తయారైంది. ఇంత జరిగినా ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, అటవీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. న్యాల్‌కల్ చెరువు అలుగుతో మొదలయ్యే ఈ పులాంగ్ వాగు నవీపేట మండలం నాళేశ్వర్ వద్ద గోదావరిలో కలుస్తుంది. గాయత్రినగర్, పద్మనగర్, ప్రగతినగర్, ఎల్లమ్మగుట్ట, కంఠేశ్వర్, గూపన్‌పల్లి వరకు వాగు కుంచించుకుపోయింది. ప్రగతినగర్, ఎల్లమ్మగుట్ట ప్రాంతాల్లో వాగును ఆక్రమించి భారీ భవనాలను నిర్మించారు. ఇక కొందరు ప్రబుద్ధులు కంఠేశ్వర్, గూపన్‌పల్లి ఏరియాల్లో పులాంగ్‌లో వేల కొద్దీ ట్రక్కుల మట్టి నింపి వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేశారు. పులాంగ్ వాగుకు ఇరువైపులా జాతీయ పక్షులైన నెమళ్లు ఉన్నాయి. అయితే ఆక్రమణలు, భారీ నిర్మాణాల కారణంగా అందమైన నెమళ్లకు నిలువనీడ లేకుండా పోతోంది. త్వరలోనే ఇక్కడి నుంచి నెమళ్లు మాయమయ్యే పరిస్థితి ఉంది. ఇక పాంగ్రా వాగు సైతం ఆక్రమణలకు గురైంది. ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో వాగును ఆక్రమించిన ఓ ప్రముఖ బిల్డర్.. వాగు స్థలంలో మట్టిపోసి చదును చేసి తాను నిర్మించి అమ్మేసిన అపార్ట్‌మెంట్లకు సంబంధించిన క్లబ్ హౌస్‌ను నిర్మించడం గమనార్హం.



బాబన్‌సాహెబ్ పహాడ్‌లోని జంతువధశాల వెనుక భాగంలో కబ్జాకు గురైన బ్రహ్మచెరువు

ఆనవాళ్లు కోల్పోయిన నిజాంసాగర్ కాలువ

మాలపల్లి, అహ్మద్‌పురా కాలనీ, నటరాజ్ థియేటర్ వెనుక నుంచి మిర్చి కాంపౌండ్ వైపు డి–54 కాలువను పూర్తిగా ఆక్రమించి ఇళ్లు, భారీ భవనాలు నిర్మించారు. దీంతో కాలువ ఆనవాళ్లు లేకుండా పోయింది. ఇతర ప్రాంతాల్లో సైతం కాలువలో పూడిక తీయలేని దుస్థితి నెలకొంది.

■ నగరంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా.. వాగులు, చెరువుల కబ్జాలు, ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులకు చెబుతామన్నారు. ఇరిగేషన్ డిప్యూటీ సీఈ ప్రవీణ్‌ను వివరణ కోరగా త్వరలో వీటిపై సర్వే చేయిస్తామన్నారు.

వరద.. ట్రాఫిక్

నగరంలో ఓ వైపు వాగులు, కాలువలు కబ్జా అవుతుండగా.. మరో వైపు అనుమతులకు సంబంధం లేకుండా భారీ నిర్మాణాలు చేపడుతుండడంతో వర్షాకాలంలో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఐదడుగుల మేర నీళ్లు నిలుస్తున్నాయి. వరద నీటి కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. 30 మీటర్ల దూరం వెళ్లేందుకు 30 నిమిషాల సమయం పట్టిన పరిస్థితి అనేకసార్లు ఉత్పన్నమైంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు, సెట్‌బ్యాక్, ఫైర్ అనుమతులు లేకుండానే భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టారు. వీటి విషయంలో అధికార యంత్రాంగం తమకేం సంబంధంలేదన్నట్లు వ్యవహరిస్తోంది. పార్కింగ్ విషయంలో పోలీసు శాఖ వాహనదారులకు జరిమానాలు వేస్తుండగా, భవనాల ఫైర్, సెల్లార్, సెట్‌బ్యాక్ విషయమై ఆయా శాఖల మధ్య ఏనాడూ సమన్వయ సమావేశం జరిగిన దాఖలాలు లేవు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్‌లో ప్రధాన నగరం స్లమ్ సిటీగా మరే పరిస్థితి ఉందని ఇందూరువాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ కహానీ - 6

32 ఎకరాల రామర్తి.. 6 ఎకరాలైంది!

బోధన్ రోడ్‌లోని రామర్తి చెరువు విస్తీర్ణం 32 ఎకరాలు కాగా ప్రస్తుతం కేవలం 6 ఎకరాల లోపు మాత్రమే మిగిలింది. దీనిపై 2024 మార్చి నెలలో 'సాక్షి'లో కథనాలు వెలువడగా.. అధికారులు మూడురోజులపాటు కూల్చివేతల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత మళ్లీ ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టారు. రామర్తి చెరువు అభివృద్ధి కోసం గతంలో దివంగత సీఎం, మహానేత రాజశేఖర్‌రెడ్డి వేసిన పైలాన్‌ను సైతం కబ్జాదారులు మాయం చేశారు. జిల్లాలోనూ 'హైడ్రా' మాదిరి 'నిడ్రా' విభాగాన్ని ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

బ్రహ్మ చెరువులో 12 ఎకరాలు మాయం

స్లాటర్ హౌస్ వెనుక ప్రాంతంలో గుట్టల మధ్య ఉన్న సహజసిద్ధమైన బ్రహ్మచెరువును సైతం కబ్జా చేశారు. కొందరు ప్రబుద్ధులు ఏకంగా చెరువుకు సంబంధించి 12 ఎకరాల భూమిని మింగేశారు. పూర్తిగా చదును చేసి ప్లాట్లు చేశారు. పక్కనే ఉన్న అటవీ భూమిలో సైతం ఓ కీలక ప్రజాప్రతినిధి అక్రమంగా వెంచర్ వేశాడు. అటవీ సరిహద్దు దిమ్మె వద్దనే వెంచర్ సరిహద్దు రాయి పాతారు. ఇక్కడికి వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో స్లాటర్ హౌస్ వెనుక ఉన్న గోడను కూల్చి రో డ్డు వేశారు. బ్రహ్మ చెరువుకు సమీపంలోని బాబన్‌సాహెబ్ పహాడ్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల సమీపంలో 2230, 2231, 2232, 2233, 2222, 2237 సర్వే నంబర్లలో అనధికారికంగా, అక్రమంగా లేఅవుట్‌లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. వీటిలోనూ కొందరు ప్రజాప్రతినిధులది కీలక పాత్ర కావడం గమనార్హం. మరోవైపు నగరంలో కీలకమైన బొడ్డెమ్మ చెరువు వద్ద 28 ఎకరాల శిఖం భూమిని ఆక్రమించి నిర్మాణా లు చేపట్టారు. ఇలా ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ భూములు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్నాయి.



కబ్జాకు గురైన రామర్తి చెరువు



బైపాస్ రోడ్డులో పూలాంగ్ వాగు

పులాంగ్‌వాగును కాపాడాలి



పులాంగ్ వాగును శుభ్రం చేయాలి. వాగు లోతును పెంచడంతోపాటు చెత్తవేయకుండా రెండు వైపులా కంచె ఏర్పాటుచేయాలి. ఇరిగేషన్ అధికారులు వాగు విస్తీర్ణాన్ని కొలిచి బౌండరీలను గుర్తించి ఆక్రమణలను తొలగించాలి. వరదల నుంచి నగరాన్ని కాపాడాలి.
– ఆకుల పాపయ్య, రైతు నాయకుడు

నిడ్రా తీసుకురావాలి



విశాలమైన పులాంగ్ వాగు క్రమంగా పిల్ల కాల్వలను తలపిస్తోంది. వాగు వాస్తవ విస్తీర్ణం కొలిచి, హద్దులు నిర్దేశించాలి. ఈ అంశంపై మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా చర్చించాం. రామర్తి చెరువు కబ్జాలు తొలగించేందుకు రూ.20 లక్షలు కేటాయించాం. పేదలకు ఇబ్బంది కలకుండా నిజామాబాద్‌లో నిడ్రా తీసుకురావాలి.
– న్యాలం రాజు, బీజేపీ నాయకుడు, ఎల్లమ్మగుట్ట

ఆక్రమణలను తొలగించాలి



పులాంగ్ వాగు, నిజాంసాగర్ కెనాల్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చలవిడిగా ఆక్రమిస్తున్నారు. వీరికి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సహకరిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వరదలు వస్తే నగరవాసులకు ప్రమాదమే. ఆక్రమణలు తొలగించాల్సిందే. – వీ ప్రభాకర్, న్యూడెమోక్రసీ నాయకుడు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- హైవేపై బ్లాక్ స్పాట్లను పరిశీలించిన ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

డిచ్‌పల్లి/ఇందల్వాయి/జక్రాన్‌పల్లి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ(సీఎంసీ), ఇందల్వాయి, జక్రాన్‌పల్లి పరిధిలోని జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 35 కిలోమీటర్ల రహదారిపై గత మూడేళ్లలో 30 ప్రాంతాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నా రు. హైవే అథారిటీ, ఇందల్వాయి అతాంగ్ టోల్‌ప్లా జా ఆధ్వర్యంలో ఇందల్వాయి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే కొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా ప్రదేశాల్లో సర్వీసు రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టారని చెప్పారు. సీఎంసీ వద్ద వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, నిర్మాణ పనులు పూర్తికావడానికి కొద్ది నెలల సమ యం పడుతుందన్నారు. ఆయన వెంట డిచ్‌పల్లి సీఐ వినోద్, ఇందల్వాయి ఎస్సై సందీప్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి పోలీసు సిబ్బంది, హైవే అథారిటీ, టోల్ ప్లాజా సిబ్బంది ఉన్నారు.



డిచ్‌పల్లి సీఎంసీ వద్ద హైవేపై బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి

ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 6,090 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 323 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు)అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1067 (18.8 టీఎంసీలు) అడుగుల నీరు ఉంది.

రేపు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్



నిజామాబాద్ నగర ప్రజలు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో నేరుగా మాట్లాడొచ్చు.

తేది : 08-07-2025 (మంగళవారం)
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు..
ఫోన్ చేయాల్సిన నంబర్: 78159 57047 / 99897 09595

ఊపందుకున్న ఎవుసం

- జిల్లాలో 50 శాతం పూర్తయిన వరినాట్లు
- జోరుగా మొక్కజొన్న సాగు
- వలస కూలీలకు దండిగా ఉపాధి



నికాల్‌పూర్ శివారులో వరినాట్లు వేస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఎవుసం ఊపందుకుంది. కురుస్తున్న వర్షాలతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. రైతన్నలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక పక్క కేజీవీల్స్ ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేయిస్తూ.. మరో పక్క వరినారును తరలించి చకచకా నాట్లు వేయిస్తున్నారు. ఐతే, ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే ఆశతో రైతులంతా సన్నాలే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ కలిపి 5.31 లక్షల ఎకరాలకు పైగా సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా వరి 4.37లక్షల ఎకరాలు అంచనా ఉండగా, ఇప్పటి వరకు 50శాతం వరకు సాగైంది. మొక్కజొన్నకు మంచి ధర వస్తుండడంతో రైతులు వరి తర్వాత మొక్కజొన్నను ఎక్కువగా విత్తారు. సోయా గతేడాదితో పోలిస్తే ఐదారు వేల ఎకరాలు తగ్గింది.

వలస కూలీలతో వరినాట్లు

వరినాట్లు వేసేందుకు జిల్లాకు ఎప్పటిలాగే మహారాష్ట్ర, యూపీ, ఏపీ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వలస కూలీలు వచ్చారు. వారికి మధ్యవర్తులుగా ఉన్న మునీములు గ్రామాల్లో వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. తక్కువ సమయంలో నాట్లు పూర్తి చేయడంలో వీరికి పెట్టింది పేరు. ఆగస్టు చివరి వరకు జిల్లాలోనే ఉండి నాట్లు పూర్తిచేసుకుని వెళ్తారు. ఐతే, ఎనిమిది మంది 10 మంది ఉండే కూలీల బృందానికి ఎకరం నాటు వేస్తే రూ.4,500 నుంచి రూ.4,800 వరకు రైతులు చెల్లిస్తున్నారు.

సగం కోటా యూరియా ఖతం

సాగు పనులు పుంజుకోవడంతో యూరియా అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు మొత్తం 75వేల మెట్రిక్ టన్నులు అవసరమని వ్యవసాయ శాఖ ఇండెంట్ పంపింది. ఇందులో ఇప్పటి వరకు 42,787 మెట్రిక్ టన్నులు జిల్లాకు రాగా, 30వేల మెట్రిక్ టన్నులు అమ్ముడుపోయింది. 12,700 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి తెలిపారు.

జిల్లాలో ఇప్పటి వరకు సాగైన ప్రధాన పంటలు (ఎకరాల్లో..)

వరి	2,04,662
మొక్కజొన్న	43,874
సోయా	32,010
పసుపు	23,520
పత్తి	841
కందులు	339

ఆరుతడిని ఆదుకున్న వర్షం



ముప్కాల్‌లో సాగవుతున్న మొక్కజొన్న

బాల్కొండ: ఆరుతడి పంటల సాగుకు వర్షం సహకరిస్తోంది. వారం రోజుల నుంచి అడపాదడపా కురుస్తూ పంటలకు జీవం పోస్తుంది. కురుస్తున్న వర్షాలతో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, సోయా పంటలు పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్నకు అన్నదాతలు యూరియా మందును వేస్తున్నారు. ఆరుతడి పంటలను ఆదుకునేలా వరుణుడు కరుణించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

18 ఎకరాల్లో మూడు పంటలు..



నాకున్న 18 ఎకరాల వ్యవసాయ భూమిలో మూ డు రకాల పంటలు వేశా. వరి, పసుపు, సోయా పంటలను ఆరున్నర ఎకరాల చొప్పున వేయగా, అవసరం మేరకు యూరియా కొనుగోలు చేశాను. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన పెట్టుబడి సాయం డబ్బులు సాగుకు ఉపయోగపడ్డాయి. – గోక గంగారెడ్డి, డొంకేశ్వర్

నల్గొండ నుంచి మహిళా కూలీలు..



ఐదేళ్లుగా డొంకేశ్వర్‌కు వసల కూలీలను తెప్పిస్తున్నా. ఈసారి కూడా నల్గొండ నుంచి ప్రత్యేకంగా మహిళలను, పశ్చిమ బెంగాల్ నుంచి మగ కూలీలను రప్పించాను. వారికి గ్రామంలోనే రెండు నెలలపాటు నివాస, భోజన సదుపాయం కల్పిస్తాం. నాట్లు పూర్తికాగానే తిరిగి వారి స్వస్థలాలకు వెళ్తారు. – బార్ల వంశీ, డొంకేశ్వర్

క్లుప్తంగా

మిర్దాపల్లి యువకుడికి కేంద్ర ప్రభుత్వ కొలువు



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన కర్నాల రాము కేంద్ర పారా మిలిటరీ బలగాల్లో డీఎస్పీ స్థాయి హోదా అయిన అసిస్టెంట్ కమాండెంట్ ఆఫ్ పోలీస్ కొలువు సాధించాడు. ఇటీవల విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ గ్రూప్ ఏ ఫలితాల్లో రాము ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో రామును తెలంగాణ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. రాము కేంద్ర కొలువు సాధించడంతో గ్రామస్తులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాంతాబాయి కుటుంబానికి తోడ్పాటు

- వృద్ధురాలి దైన్య స్థితిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- సీఎం ఆదేశాల మేరకు సాయానికి ఏర్పాట్లు చేసిన అధికారులు
- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

నిజామాబాద్అర్బన్: వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు సబ్బని శాంతాబాయి కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అవసరమైన తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. బాధిత కుటుంబం కోరిన రీతిలో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. పుట్టుకతోనే అంధులుగా జన్మించిన ముగ్గురు కుమారులు చంద్రమోహన్, హరిచరణ్, సాయిరాంలకు సపర్యలు చేయడానికి శాంతాబాయి పడుతున్న ఇబ్బందులను ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి మానవీయ కోణంలో స్పందిస్తూ, శాంతాబాయి కుటుంబానికి అవసరమైన తోడ్పాటును అందించాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులతో కూడిన బృందం ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారని అన్నారు. ప్రభుత్వం తరఫున శాంతాబాయికి వృద్ధాప్య పింఛన్, ఆమె ముగ్గురు కుమారులకు దివ్యాంగుల పింఛన్ వస్తోందని వెల్లడించారు. శాంతాబాయి కుటుంబం ముందుకు వస్తే డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో కొనసాగుతున్న వృద్ధాశ్రమంలో చేర్పించి, తగిన సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. స్వగ్రామంలోనే ఉండాలని కోరుకుంటే స్థానికంగానే వారికి సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్యంపై 'బ్యాగు' భారం

- నర్సరీ నుంచే పుస్తకాల మోత
- బరువు మోయలేకపోతున్న చిన్నారులు
- ప్రయివేటు పాఠశాలల్లో అమలుకాని జీవో 22
- విద్యాశాఖ పర్యవేక్షణ కరువు



బరువైన బ్యాగులతో పాఠశాలకు వెళుతున్న చిన్నారులు

నందిపేట్(ఆర్మూర్): పసి వయసులోనే చిన్నారులు లేత భుజాలపై బండెడు పుస్తకాలు మోస్తూ కుంగిపోతున్నారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు డజన్ల కొద్దీ పుస్తకాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. దీంతో పిల్లలు పుస్తకాల బరువు మోయక తప్పడం లేదు. తరగతులు పెరిగే కొద్దీ విద్యార్థుల బ్యాగు బరువు సైతం పెరుగుతుంది. సాధారణంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక పలక, ఒక నోట్ పుస్తకం ఉంటాయి. కానీ.. ప్రస్తుతం ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే వారితో 20 పాఠ్య, నోట్ పుస్తకాలు మోయిస్తున్నారు. పిల్లల బరువులో పది శాతానికి మించిన బరువు వేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వం సైతం పుస్తకాల బరువుకు సంబంధించి నిబంధనలు తీసుకొచ్చినా వాటిని అమలు చేస్తున్న దాఖలాలు ఏ పాఠశాలలోనూ కనిపించడం లేదు.

2017లో జీవో జారీ

విద్యార్థుల వీపుపై బండెడు బరువును తగ్గించడానికి 2017లో ప్రభుత్వం 22 జీవోను జారీ చేసింది. ఎస్‌సీఈఆర్టీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన పుస్తకాలే ప్రయివేటు పాఠశాలలో వినియోగించాలి. హోం వర్క్ పేరిట ట్యూషన్లు, స్పెషల్ క్లాసులు నిర్వహించొద్దు. ఆట పాటలతో చదువు సాగించాలి. విద్యార్థులకు వాటర్ బాటిల్ బరువు లేకుండా పాఠశాలలోనే తాగునీటిని అందించాలి. ఐదో తరగతి వరకు హోం వర్క్ ఉండకూడదని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. అయినా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలో జీవో అమలుకు నోచుకోవడం లేదు.

తరగతుల వారీగా బరువు ఇలా..

తరగతులు	బరువు (కిలోల్లో)
1–2	1.5
3–5	2–3
6–7	4
8,9	4.5
10	5

శారీరక ఎదుగుదలపై ప్రభావం

విద్యార్థులు అధిక భారం మోస్తున్నందున వారి శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,171 ఉండగా, ప్రయివేటు పాఠశాలలు 475 వరకు ఉన్నాయి. ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్స్‌తోపాటు ఒక రఫ్ నోట్‌బుక్ మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తోపాటు గైడ్లు, డ్రాయింగ్, రికార్డులు, డైరీలు, ఇతర బుక్‌లు కలుపుకొని కిలోల కొద్దీ పుస్తకాలను బ్యాగులో మోసుకెళ్లాల్సి వస్తుంది. రోజుకు 10 కోలోల బరువు కంటే ఎక్కువగానే చిన్నారులు తమ భుజాలపై మోస్తూ ఒకటి, రెండు అంతస్తుల భవనాల్లోని తరగతి గదులకు వెళుతున్నారు. దీంతో చాలా మంది పిల్లలు వెన్ను నొప్పి, జాయింట్ పెయిన్స్ బారిన పడుతున్నారు.

చదువుపై శ్రద్ధ పెట్టలేరు..

అధిక బరువు మోస్తున్న కారణంగా పిల్లలు మానసిక ఆందోళన గురవుతారు. త్వరగా అలసిపోయి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతారు. నడుము, వెన్ను, కండరాల నొప్పులు వచ్చే ఆస్కారం ఉంటుంది. వయసుకు తగిన బరువును మాత్రమే చిన్నారులతో మోయించాలి.

– ప్రవీణ్, వైద్యాధికారి, నందిపేట

ఊరి పేరులో భాగమైన రథాలు





రామారెడ్డిలోని సీతారామచంద్ర స్వామి, రాజరాజేశ్వర స్వామి రథాలు, కాలభైరవుడి రథం

మీకు తెలుసా?

మండల కేంద్రమైన రామారెడ్డిని పూర్వకాలం నుంచే రథాల రామారెడ్డిగా పిలిస్తున్నారు. దోమకొండ సంస్థానాధీశులు రామిరెడ్డి, గ్రామంలోని రామాలయం పేరుమీదుగా గ్రామానికి రామారెడ్డి అనే పేరు వచ్చింది.

- రామారెడ్డి గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఒక రథం, రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఒక రథం పూర్వకాలం నుంచే ఉన్నాయి. అలాగే ఇసన్నపల్లి(రామారెడ్డి) కాళభైరవుడి ఆలయంలో ఒక రథం ఉంది.
- ఊర్లో ఇన్ని రథాలు ఉండటంతో గ్రామం పేరు రథాల రామారెడ్డిగా ఎన్నో ఏళ్ల నుంచి వాడుకలో ఉంది.
- ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజు సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి వార్లకు రథోత్సవం నిర్వహిస్తారు.
- ప్రతి యేటా కార్తీక బహుళ పంచమి నుంచి కార్తీక బహుళ నవమి వరకు జరిగే కాలభైరవుడి జన్మదినోత్సవాల్లో స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు.
- సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి రథాలను 1992 వరకు కట్టెలతో తయారుచేసి, ఉత్సవాలు ముగిసిన తర్వాత విప్పి వేసేవారు.
- 1995లో గ్రామస్తులు ఇనుప రథాలను తయారు చేయించారు. – రామారెడ్డి

సమాచారం

నిందితుల అరెస్టు.. నిబంధనలు

ఖలీల్‌వాడి: వివిధ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసేటప్పుడు పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్) చట్టం ప్రకారం నడుచుకోవాలి. క్రిమినల్ కేసుల్లో మహిళలు, వృద్ధుల అరెస్ట్, విచారణ చేసేటప్పుడు చట్టాలకు లోబడి వ్యవహరించాలి.

- మూడేళ్ల జైలు శిక్ష ఉన్న నేరాల కింద నమోదైన కేసుల్లో 60ఏళ్లు పైబడిన వారు నిందితులుగా ఉంటే వారిని అరెస్ట్ చేయడానికి ఏసీపీ, పైస్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- నేరాల్లో మహిళలు నిందితులైతే, వారిని సూర్యోదయం తర్వాత లేదా సూర్యాస్తమయం లోపు అరెస్ట్ చేయాల్సి ఉంటుంది.
- రాత్రివేళల్లో అయితే నిందితురాలు ఉన్న ప్రాంతంలో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా, కేసు నమోదు చేసిన ప్రాంతంలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి, వారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నిందితురాలి వెంట మహిళ పోలీసులను ఉంచాలి.

మలేషియాలో వలస కార్మికుల సదస్సు

- 'గల్ఫ్ సంక్షేమ బోర్డు'పై చర్చ



సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): అంతర్జాతీయ వలసలపై మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 4వ తేదీన ప్రారంభమైన మూడు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ సదస్సును నిర్వహించింది. భారత్‌తో పాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, నేపాల్, ఖతార్, బహ్రెయిన్, క్రోయేషియా, మలేషియా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో తెలంగాణ నుంచి ఖతర్‌కు వలస వెళ్లి అక్కడ తెలంగాణ గల్ఫ్ సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుందరగిరి శంకర్‌గౌడ్, గల్ఫ్ రిటర్నీ, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సైండ్ల రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సులో 'గల్ఫ్ సంక్షేమ బోర్డు'పై చర్చించినట్లు వారు 'సాక్షి'తో తెలిపారు. వలస కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో పాటు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు జరిగితేనే సౌకర్యాలు మెరుగవుతాయనే అభిప్రాయాన్ని సదస్సులో పాల్గొన్నవారు వ్యక్తం చేశారన్నారు. వలస కార్మికులకు వివిధ దేశాల చట్టాలపై అవగాహన కల్పించడం, ఆయా దేశాలలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించడం, తద్వారా వాణిజ్యాభివృద్ధికి పాటుపడాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవాసుల కోసం అమలు చేస్తున్న పథకాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవ్!

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు
- వేతనాలు ఇవ్వాలని డిమాండ్



వేతనాలు చెల్లించాలని మోర్తాడ్‌లో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో డబ్బులు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రత్యేకంగా ఖాతాలు తెరిపించినా..

జీపీ కార్మికులకు గతంలో రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు విడుదల చేసి, జీపీల వారీగా వేతనాలు ఇచ్చేవారు. కానీ కార్మికులకు నిధులకు బదులుగా వేతనాలను చెల్లిస్తామని గతంలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా కార్మికులతో ప్రత్యేక ఖాతాలను తెరిపించారు. ఆరు నెలల పాటు వేతనాలను చెల్లించిన ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలను విడుదల చేయడంలో జాప్యం చేస్తోంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం తాము నిత్యం కష్టపడుతున్నా ప్రభుత్వం మాత్రం వేతనాలు చెల్లించకుండా వేధిస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో నెలల తరబడి వేతనాలను చెల్లించకుండా నిలుపుదల చేయడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. ప్రస్తుతం పలు మండల కేంద్రాల్లో కార్మికులు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలను చెల్లించాలని వారు కోరుతున్నారు.

జిల్లాలో 2500 మంది కార్మికులు..

జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,500 మంది వరకు గ్రామ పంచాయతీ కార్మికులు ఉన్నారు. పంచాయతీల్లో జనాభా ప్రకారం కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.9,500ల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. పునర్విభజనకు ముందు జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.ఒక్కో పంచాయతీలో ఇద్దరు నుంచి 20 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. చిన్న పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురితోనే నెట్టుకువస్తుండగా మేజర్‌పంచాయతీల్లో మాత్రం పదుల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారు. వీరు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పన్నుల వసూలు ఇతరత్రా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది..

ప్రభుత్వం మూడు నెలల నుంచి వేతనాలను చెల్లించకుండా ఇబ్బందికి గురిచేస్తుంది. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడం కోసం మేము దుర్వాసనను సైతం లెక్క చేయడం లేదు. ప్రజల ఆరోగ్యం కోసం మేము కష్టపడితే వేతనాలను చెల్లించకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారు.

– మజీద్, జీపీ కార్మికుడు, మోర్తాడ్

ప్రభుత్వం స్పందించాలి..

ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యను పరిష్కరించాలి. ప్రజల కోసం ఎంతో కష్టపడుతున్నా మా కష్టానికి తగిన గుర్తింపు లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా కార్మికులకు వెంటనే జీతాలను చెల్లించాలి. లేకుంటే కార్మికులం అంతా ఉద్యమిస్తాం.

– దశరథ్, జీపీ కార్మికుడు, దొన్కల్

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు



మోపాల్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న సుస్మిత



సిరికొండలో బాధ్యతలు స్వీకరిస్తున్న కళ్యాణి

మోపాల్: మోపాల్ ఎస్సైగా జడ్ సుస్మిత పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా ఉన్న యాదగిరి గౌడ్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. వీఆర్‌లో ఉన్న సుస్మిత మోపాల్ ఎస్సైగా వచ్చారు. అంతకుముందు ఎస్సై యాదగిరి గౌడ్‌కు స్టేషన్ సిబ్బంది పూలు చల్లుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్‌ఐ కార్యాలయం నుంచి కారు వరకూ వెళ్లి మర్యాదపూర్వకంగా సన్మానించారు.

సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్ ఎస్సైగా మామిడిపల్లి కళ్యాణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎల్ రామ్ నిజామాబాద్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న కళ్యాణికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. సిరికొండ పోలీస్ స్టేషన్‌కు మహిళా ఎస్సైని నియమించడం ఇదే తొలిసారి.

బాల్కొండ : బదిలీపై వెళ్లిన ఎస్సైలు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మెండోరా ఎస్సైగా జాదవ్ సుహాసిని, బాల్కొండ ఎస్సైగా శైలెందర్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మెండోరాలో విధులు నిర్వహించిన యాసర్ ఆరాఫత్ నిజామాబాద్ వీఆర్‌కు బదిలీపై వెళ్లగా, బాల్కొండ ఎస్సై బర్కుంట నరేశ్ బదిలీపై ఆదిలాబాద్‌లో వీఆర్‌కు వెళ్లారు. ఈసందర్భంగా నూతన ఎస్సైలకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.





మెండోరాలో.. ఎస్సై సుహాసిని, బాల్కొండలో.. ఎస్సై శైలెందర్

నియామకం



గాంధారి నరసింహారెడ్డి
అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్

నిజామాబాద్ లీగల్: నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గాంధారి నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని అనంతగిరి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి ఇంటర్మీడియట్ విద్యను ఖిల్లా కళాశాలలో, డిగ్రీ, లా ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కోర్టులో సుదీర్ఘకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. నరసింహారెడ్డి నియామకంపై జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజ్, గవర్నమెంట్ ప్లీడర్ సుదర్శన్, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మద్నూర్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్‌ఐ సాయిబాబా ఆదివారం తెలిపారు. పొతంగాల్ మంజీరనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింబూర్ గ్రామం వద్ద శనివారం రాత్రి ట్రాక్టర్‌ను పట్టుకున్నామని అన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం..

రుద్రూర్: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి రుద్రూర్ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. రాజీవ్ నగర్ కాలనీ వద్ద బొలెరో వాహనాన్ని పట్టుకొని అందులో ఉన్న ఎనిమిది ఎద్దులను స్థానిక గోశాలకు తరలించామన్నారు. వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతి

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట్ రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే పట్టాలపై ఓ గుర్తుతెలియని మహిళను గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందింది. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ హరికృష్ణకు తెలుపగా, ఆయన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే రైల్వే పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని రైలు రాకను గుర్తించకుండా గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు వారు పేర్కొన్నారు. మృతురాలిని గుర్తించేందుకు ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతురాలి వయస్సు సుమారు యాభై ఏళ్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలిని గుర్తించిన వారు నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి, 8712658591, 9493451642 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మాన్యాపూర్‌లో ఒకరి ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని మాన్యాపూర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మాన్యాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (35) కుటుంబంలో గతకొన్ని రోజులు గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బుచ్చయ్య రెండు నెలల క్రితం ఓ ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కానిస్టేబుల్ 2004బ్యాచ్ సభ్యులు .3లక్షలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ బ్యాచ్‌కు చెందిన బుచ్చయ్య ఆకస్మిక మరణం తీరని లోటు అన్నారు. కానిస్టేబుల్‌లు నాయిని గంగారాం, నర్సింగ్, సురేష్, రాజశేఖర్, నరేష్, సాయిలు, శైలేష్, నేతా స్వప్న, ఇంద్ర, అనిల్ పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

నవీపేట: మండలంలోని మిట్టిపూర్ శివారులో ఆదివారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మేకల కాపరి భీమన్న గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మేకలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా మందపై చిరుతపులి దాడి చేసింది. ఒక మేకపై దాడి చేసి, మళ్లీ చెట్ల పొదల్లోకి వెళ్లింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినట్లు బాధితులు తెలిపారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం.. గాయపడ్డ చేంగల్ వాసి

- ప్రవాసీ ప్రజావాణి చొరవతో ఐదు రోజుల్లో క్షేమంగా ఇంటికి చేరిన వైనం



హైదరాబాద్‌కు చేరుకున్న సాయిబాబాతో అతని కుటుంబ సభ్యులు, మంద భీంరెడ్డి తదితరులు

మోర్తాడ్(బాల్కొండ): సౌదీఅరేబియాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చేంగల్ వాసి గాయపడగా, ప్రవాసీ ప్రజావాణి చొరవతో ఐదు రోజుల్లోనే హైదరాబాద్‌కు చేరుకున్నాడు. వివరాలు ఇలా.. భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామానికి చెందిన సాయిబాబా ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన సౌదీకి వెళ్లాడు. గత నెల 16న అతడు రియాద్ నుంచి దమామ్‌కు కారు నడుపుకుంటూ వెళుతుండగా టైర్ పేలడంతో ప్రమాదానికి గురయ్యాడు. గాయాలపాలైన సాయిబాబాకు అక్కడి ఆస్పత్రిలో చికిత్స అందించగా, 25న డిశ్చార్జి అయి, తన గదిలో ఉంటున్నాడు. ఈ ఘటనపై తీవ్ర ఆందోళనకు గురైన బాధితుడి తల్లి ప్యాట్ల గంగు ఈనెల 1న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించింది. సౌదీ నుంచి తన కొడుకును ఇక్కడకు రప్పిస్తే మెరుగైన వైద్యం చేయించుకుంటామని ఆమె విన్నవించింది. దీంతో అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి బాధితులకు, ప్రవాసీ ప్రజావాణి అధికారుల మధ్య సమన్వయం చేసి పరిస్థితిని వివరించారు. సీఎంవో అధికారులు, ప్రవాసీ ప్రజావాణి నోడల్ అధికారి దివ్యాదేవరాజన్ చొరవతో సాయిబాబా ఆదివారం సౌదీ నుంచి విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడికి స్వాగతం పలికి మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సాయిబాబా ఇంటికి చేరుకోవడానికి సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్(సాటా) రూ.2లక్షల సాయం అందించింది. సాటా ఈస్టన్ అధ్యక్షుడు రంజిత్ చిట్టలూరి, నాగార్జున బృందం విరాళాలు పోగు చేసి విమాన టిక్కెట్, ఇతర ఖర్చుల కోసం సాయం అందించారు. తన కొడుకును క్షేమంగా రప్పించడానికి సహకరించిన అందరికి అతడి తల్లి గంగు కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

- సుమారు 11 తులాల బంగారం, రూ.35వేల నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుస్మిత


మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో తాళం వేసిఉన్న మూడిళ్లల్లో గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని గన్నారం మోహన్ తన ఇంటికి తాళం వేసి డాబాపైన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి వేళ దుండగుడు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. బెడ్‌రూంలోని బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న 11 తులాల వరకు బంగారం, బంగారు నగలు, రూ.10వేల వరకు నగదును దోచుకెళ్లాడు. అనంతరం దుబ్బాక గంగామణి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.25వేల నగదును ఎత్తుకెళ్లాడు. అదేవిధంగా అరుగు చిన్నయ్య ఇంటి తాళాలు ధ్వంసం చేసినప్పటికీ విలువైన వస్తువులు లేకపోవడంతో చోరీకి పాల్పడలేదు. ఆయా ఇళ్ల కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం బృందం ఘటనాస్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై సుస్మిత కేసు నమోదు చేసుకున్నారు. కాగా దుండగుడు ఒక్కడే వచ్చి మూడిళ్లలో చోరీ చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. మంకీ క్యాంప్, చేతులకు గ్లౌజులు ధరించి ఉన్నాడని, త్వరలోనే దొంగను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



రుద్రూర్: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై సాయన్న సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నగరంలోని విశ్వశాంతి హైస్కూల్ 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

నిజామాబాద్‌రూరల్: నగరంలోని పద్మనగర్ వద్ద గల విశ్వశాంతి హైస్కూల్ 2008-09 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కంఠేశ్వర్ బైపాస్ వద్ద ఉన్న డీఆర్ఆర్ ఫామ్‌హౌస్‌లో కార్యక్రమం ఏర్పాటు చేయగా, ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు. అంతకుముందు విద్యార్థులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు యోగాక్షేమాలు తెలుసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విశ్వశాంతి యాజమాన్యం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.